ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కర్ణాటక వార్తలు
ఆదివారం 1 సెప్టెంబరు 2024



ట్రేడ్ లైసెన్స్ లేని 10 దుకాణాల సీజ్

రాయచూరు, ఆగస్టు 31: జిల్లాలోని సింధనూరు నగరంలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న 10 దుకాణాలను శనివారం అధికారులు సీజ్ చేశారు. అకస్మాత్తుగా 30 మందికి పైగా అధికారులు వివిధ బృందాలుగా ఏర్పడి నగరం లో ట్రేడ్ లైసెన్సులను పరిశీలించి మున్సిపాలిటీ అనుమతి లేకుండా నిర్వహిస్తు న్న దుకాణాలను సీజ్ చేశారు. ఒకే రోజు దాదాపు రూ.2 లక్షలకుపైగా ఫీజు వసూలైనట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మం జునాథ్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, గడువు ముగిసిన వెంటనే రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు.

సీఎం పైనే.. ద్వేషమెందుకు..?

● ప్రాసిక్యూషన్ అనుమతులు ఉపసంహరించుకోండి ● ఆ నలుగురిపైనా విచారణకు ఆదేశించండి
● గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం ● కేపీసీసీ ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్'

విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన







గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు... రాజ్‌భవన్‌కు తరలి వస్తూ..

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యపైనే ద్వేషమెందుకని, ఆయనను లక్ష్యంగా చేసుకునే గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు ఆదేశించారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. 'ముడా'లో అవినీతి జరిగిందని ఫిర్యాదు అందిన గంటల్లోనే సీఎం సిద్దరామయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన గవర్నర్ నెలలకిందటే చార్జ్‌షీట్‌లు దాఖలైన వివాదాలకు సంబంధించి కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీ మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళ జొల్లె, జనార్దనరెడ్డిపై ఎందుకు వెనుకడుగు వేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం 'చలో రాజ్‌భవన్'కు పెద్దఎత్తున మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలు తరలి వెళ్లారు. అంతకు ముందు విధాన సౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సహా మంత్రులందరూ పాల్గొన్నారు. సీఎంపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన గవర్నర్ నెలల తరబడి ఇతరుల వివాదాలపై ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్ దాకా వెళ్లారు. ముఖ్యనాయకులు గవర్నర్‌ను కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు. రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉండే ప్రాసిక్యూషన్ అర్జీలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. సీఎం సిద్దరామయ్యకు ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకోవాలని మరో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం రాజ్‌భవన్ బయట డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన గవర్నర్ కార్యాలయం ఒక పార్టీ కార్యాలయంగా మారకూడదన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవికి భంగం కలిగించరాదనేది తమ అభిలాష అన్నారు. గవర్నర్ తమకు కాఫీ, టీ, ఉపాహారాన్ని ఇచ్చారని, అంతకంటే ముఖ్యంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామితోపాటు ముగ్గురు బీజేపీ మాజీ మంత్రులపై అవినీతికి సంబంధించి కోర్టు సూచనలతో లోకాయుక్త సిట్ సమగ్ర నివేదికలు సమర్పించిందన్నారు. వారిపై ఇంతవరకు చర్యలు లేవన్నారు. సీఎంపై పిటిషన్ వచ్చిన వెంటనే నోటీసులు ఇవ్వడం న్యాయమా అని ప్రశ్నించారు. ఈ విషయంలో గవర్నర్ విభిన్నంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రజాజీవనంలో ఉన్న గవర్నర్ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. రాజ్యాంగ ప్రతినిధిగా మాత్రమే పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రిపై ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. ఇక్కడ ఎవరూ శాశ్వతం కాదని అన్నారు. గవర్నర్ స్పందనతో న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నామని, తమ కర్తవ్యం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం దృష్ట్యా పోరాటం చేశామన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ పిటిషన్లపై చర్చించారా..? అనే ప్రశ్నకు తమ వద్ద ఎలాంటి పిటిషన్లు పెండింగ్‌లో లేవని తేల్చి చెప్పారని అన్నారు. విధానసౌధలో నిరసనలో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య, అనంతరం 'చలో రాజ్‌భవన్'లో పాల్గొనలేదు. విధానసౌధలో జరిగిన ఆందోళనలో పార్టీ సీనియర్ నేత వీరప్పమొయిలీ, మంత్రులు పరమేశ్వర్, రామలింగారెడ్డి, హెచ్‌కే పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, శరణప్రకాశ్ పాటిల్, భైరతి సురేశ్, బోసరాజు, జమీర్ అహ్మద్‌ఖాన్, వెంకటేశ్, దినేశ్ గుండూరావు, ఎస్‌ఎస్ మల్లికార్జున, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సీనియర్ నేతలు ఎంఆర్ సీతారాం, ఆర్‌వీ దేశ్‌పాండే, టీబీ జయచంద్ర, యుబీ వెంకటేశ్, ఐవాన్ డిసోజా, శరత్ బచ్చేగౌడ, సలీం అహ్మద్, తోపాటు వందలాదిమంది వివిధ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.



● మరో రెండు రోజులు సీఎంకు ఊరట
● రేపు మధ్యాహ్నం మళ్లీ విచారణ

ముడా కేసులో సుదీర్ఘ వాదనలు

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదంపై హైకోర్టులో శనివారం సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. సీఎం సిద్దరామయ్య తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, రవివర్మకుమార్ వాదనలు వినిపించారు. గవర్నర్ తరఫున తుషార్ మెహతా ఆసక్తికర ప్రశ్నలను లేవనెత్తారు. ముడా వివాదంలో అవినీతి జరగలేదని చెప్పుకొనే ప్రభుత్వం.. రిటైర్డు న్యాయమూర్తి, ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గవర్నర్ ఎప్పుడైనా, ఎటువంటి నిర్ణయమైనా తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గవర్నర్‌ను ప్రశ్నించేందుకు వీలు లేదన్నారు. కేబినెట్ అనేది ముఖ్యమంత్రి ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ అని, అందులో ఆయనకు మద్దతుగానే నిర్ణయాలు ఉంటాయన్నారు. కోల్పోయిన భూమికి పరిహారం కేటాయించాలనే అంశంపై 2021 అక్టోబరు 25న ముడాలో జరిగిన సభలో సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర సిద్దరామయ్య ఉన్నారని తెలిపారు. 50:50కు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆ తర్వాతే సీఎం భార్యకు 14 ఇంటి స్థలాలు కేటాయించారని పేర్కొన్నారు. గవర్నర్ ప్రతి అంశంపైనా నోట్ సిద్ధం చేసే తదుపరి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వివాదం వచ్చినప్పుడు విచారణకు ఆదేశించడం సమంజసమే అన్నారు. ఫిర్యాదు చేసిన ప్రదీప్‌కుమార్ తరఫున ప్రభులింగ నావదగి, టీజే అబ్రహాం తరఫున రంగనాథ్ తమ వాదనలు వినిపించారు. మరిన్ని అంశాలు ప్రస్తావించాల్సి ఉందని న్యాయవాదులు కోరిన మేరకు సెప్టెంబరు 2కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రకటించారు. సీఎం వివాదంలో కోర్టు ఎటువంటి తీర్పు ఇస్తుందోనని ఉత్కంఠ కొనసాగింది. ఓవైపు చలో రాజ్ భవన్ ఆందోళన ముగించి కోర్టు తీర్పు కోసం ఎదురు చూశారు. మధ్యాహ్నానికి వాయిదా పడ్డంతో నగరంలోనే మంత్రులు, ఎమ్మెల్యేలంతా పడిగాపులు కాశారు. సాయంత్రం దాకా కోర్టు తీర్పు కోసం వేచిచూశారు. వాయిదా పడ్డంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కేసును సెప్టెంబరు 2 (సోమవారం) మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రకటించారు. దీంతో సీఎం సిద్దరామయ్యకు మరో రెండు రోజులు ఉపశమనం లభించింది.

శిగ్గావి బీజేపీ అభ్యర్థిగా బొమ్మై కుమారుడు భరత్..?



భరత్ బొమ్మై

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ద్వారా మరో రాజకీయ వారసుడు అరంగేట్రం చేస్తున్నారు. హావేరి జిల్లా శిగ్గావి నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రాతినిధ్యం వహించిన స్థానం నుంచే ఆయన కుమారుడు భరత్ బొమ్మైను అభ్యర్థి చేయాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. భరత్ అభ్యర్థి అయితే బొమ్మై కుటుంబంలో మూడోతరం వారసుడు వచ్చినట్టు అవుతుంది. గతంలో ఎస్ఆర్ బొమ్మై ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన కుమారుడు బసవరాజ్ బొమ్మై కూడా ఇటీవల మూడున్నరేళ్లపాటు సీఎంగా కొనసాగారు. తాజాగా భరత్ రాజకీయాల్లోకి వస్తే మూడోతరం ప్రవేశించినట్టు కానుంది. పార్టీ వర్గాలు నియోజకవర్గంలో సర్వేలు కొనసాగిస్తున్నాయి. బసవరాజ్ బొమ్మై ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతూనే ముఖ్యమంత్రి అయ్యారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో హావేరి నుంచి విజయం సాధించారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. శిగ్గావి నుంచి ఎవరూ అభ్యర్థి కావాలని ఉత్సాహం చూపడం లేదని భరత్‌కు టిక్కెట్ రానుందని పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా బొమ్మై శిగ్గావిలో అన్ని వర్గాల ప్రజలతో కలసి మద్దతు కోరుతున్నారు. రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలకు ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. రామనగర జిల్లా చెన్నపట్టణ, హావేరి జిల్లా శిగ్గావి, బళ్లారి జిల్లా సండూరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడనుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ఎంపీలుగా విజయం సాధించారు. మూడు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ కూటమి కసరత్తు చేస్తున్నాయి. చెన్నపట్టణ అభ్యర్థి విషయంలో రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇక్కడ అభ్యర్థి ఎవరైనా తనకు ఓటు వేయాలని, తానే పోటీ చేస్తున్నట్టు భావించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం మరోసారి కోరారు. ఇప్పటికే పలుమార్లు తానే అభ్యర్థి అంటూ డీకే శివకుమార్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. బీజేపీ-జేడీఎస్ కూటమి నుంచి మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా జేడీఎస్ పార్టీ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మరో రెండు రోజుల్లో ప్రకటిస్తామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఇక సండూరు విషయంలో అభ్యర్థికి సంబంధించి రెండు పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఆలయాల్లో శ్రావణ శనివారం పూజలు



బలభీమ మారుతి మందిరంలో విశేష పూజలు

చింతామణి, ఆగస్టు 31: శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా పలు ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. పట్టణ శివారులోని కోలారు రోడ్డు కురుటహళ్లిలోగల వీరాంజనేయస్వామికి పసుపు కుంకుమ అలంకరణ చేశారు. తాలూకాలోని హిరేకట్టిగేనహళ్లిలోని బలభీమ మారుతి మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శీనప్ప నేతృత్వంలో పూజాది కైంకర్యాలు సాగాయి. అలాగే హిరేకట్టిగేనహళ్లిలోని లక్ష్మీ వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



హిరేకట్టిగేనహళ్లిలోని లక్ష్మీవెంకటరమణ స్వామి ఆలయంలో



కురుటహళ్లి ఆంజనేయస్వామికి పసుపుకుంకుమ అలంకరణ

కాంగ్రెస్‌లో కుర్చీ ఆట

● ముఖ్యమంత్రి పదవి కోసం పాకులాట ● కాంగ్రెస్ కార్యాలయంగా విధానసౌధ ● శాసనసభలో ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లో కుర్చీ ఆట సాగుతోందని, తొలుత సీఎం సిద్దరామయ్య వాటిని అరికట్టుకుంటే బాగుంటుందని శాసనసభలో ప్రతిపక్షనేత అశోక్ ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ కార్యాయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్‌భవన్‌ను బీజేపీ కార్యాలయంగా మార్చారంటే విధానసౌధను కాంగ్రెస్ కార్యాలయం చేశారంటూ అనాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వమే నిరసనలు చేపట్టడం అంటే పూర్తిగా వైఫల్యం చెందినట్టే అన్నారు. కాంగ్రెస్ పాలనలో అధికార దుర్వినియోగం సాగుతోందని ఆరోపించారు. పాలన సాగించేవారు నిరసనలు చేపడితే ఏమని అర్థం చేసుకోవాలన్నారు. ఏకంగా సీఎం, డీసీఎం కూడా ఆందోళన చేస్తున్నారని ఇదెక్కడి విధానమని ప్రశ్నించారు. గవర్నర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి విచారణకు సూచించారని తెలిపారు. ఇందులో తప్పు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. చరిత్రలో ఇదే తొలిసారి జరిగినట్టు సీఎం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో యడియూరప్ప, జనార్దనరెడ్డిపై గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వలేదా..? అన్నారు. వారికి 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నారనే అహంకారం ఉం దని, ప్రభుత్వాన్ని కూల్చేకుట్ర చేస్తోందని తమ పార్టీపై ఆరోపించడం అర్థరహితమన్నారు. ఎమ్మెల్యేలపై సీఎంకు నమ్మకం లేనట్టు ఉందన్నారు. పార్టీ నుంచి నిరసనలో పాల్గొనాలంటే ముందు మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఇలా ద్విపాత్రాభినయం సరికాదన్నారు. తప్పు చేయకుంటే సీఎంకు భయమెందుకని ప్రశ్నించారు.



బీజేపీ కార్యాలయంలో మీడియాతో ప్రతిపక్షనేత అశోక్

టీడీపీకి ఐటీ ఉద్యోగుల అండ

● పార్టీ అభిమానులను ఐక్యం చేసిన బీటీఎఫ్ ● నలుగురితో ప్రారంభమై... వేలమందికి మార్గదర్శకం ● నవశకం పేరుతో నేడు టీడీపీ ఫోరం 11వ వార్షికోత్సవం

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐటీ ఉద్యోగాల కోసం బెంగళూరులో నివసిస్తున్నవారు తెలుగుదేశం పార్టీపై అభిమానంతో ఓ కూటమిగా ఏర్పడి అండగా నిలుస్తున్నారు. 11ఏళ్ల కిందట నలుగురితో శ్రీకారం చుట్టి నేడు వేలాది మందితో ఐక్యత చాటుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐటీ ఉద్యోగుల ఆలోచనతో బెంగళూరు టీడీపీ ఫోరం ఏర్పాటైంది. ఇలా వేలాది మందిని ఐక్యం చేసి పార్టీకి అండగా నిలుస్తోంది. 11 ఏళ్ల ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో తెలుగుదేశం పార్టీకి ఫోరం సభ్యుల సహకారం నిరంతరమైంది. ఉద్యోగాలు చేస్తూ వారాంతంలో సరదాగా గడపాలనే విధానాన్ని వీడి సొంతూరు, సొంత రాష్ట్రం కోసం ఏదో ఒకటి చేయాలని భావించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏపీలో సాగిన ప్రతి పరిణామంపైనా బెంగళూరులో ఫోరం ప్రతినిధులు స్పందించారు. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరగనటువంటి నిరసనలు, కార్యక్రమాలు ఇక్కడ కొనసాగాయి. ఇదే సందర్భంలోనే వేలాది మంది పార్టీ అభిమానులను ఐక్యం చేసుకున్నారు. అంతకు ముందు రెండు స్థానాలకు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెలల తరబడి ఫోరం సభ్యులు పని చేసి భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కంచర్ల శ్రీకాంత్ విజయానికి బాటలు వేశారు. అసెంబ్లీలో చంద్రబాబుకు అవమానం జరిగిన రోజు నుంచి బీటీఎఫ్ కన్వీనర్ కనకమేడల వీర నల్లటి దుస్తులతోనే తన నిరసన సాగించారు. పార్టీ అభిమానంతో ఏర్పడిన బెంగళూరు తెలుగుదేశం ఫోరం 11వ వార్షికోత్సవాన్ని 'నవశకం' మంచిరోజులు వచ్చేశాయి పేరిట ఆదివారం కేఆర్ పురంలోని ఎంటీబీ శుభమేరు కల్యాణమండపంలో నిర్వహిస్తున్నారు. ముఖ్యులుగా ఏపీ మంత్రులు కొల్లు రవీంద్ర, సవితమ్మ, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, అమిలినేని సురేంద్రబాబు వస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం దాకా కార్యక్రమాలు కొనసాగుతాయని ఫోరం ముఖ్యులు సోంపల్లి శ్రీకాంత్‌తోపాటు పవన్, శివ తెలిపారు.




నవశకం సమావేశానికి ఏర్పాట్లు ఇలా..

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

శ్రీల ప్రభుపాద (జయంతి)



ఆధ్యాత్మికవేత్త, ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులైన అభయ చరణా రవింద భక్తివేదాంతస్వామి లేదా శ్రీల ప్రభుపాద 1896 సెప్టెంబరు 1న కోల్‌కతాలో జన్మించారు. చైతన్య మహాప్రభు బాటలో కొన సాగుతూ హరేకృష్ణ నామాన్ని పఠించడం ద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందించేలా కృషి చేశారు. శ్రీకృష్ణ పరమాత్ముడి బోధనలు ప్రచారం చేశారు. దేశంలోనే కాక అమెరికా, యూరప్ తదితర దేశాలలో సైతం ఆయనకు అనుచరులు ఉండడం విశేషం. 1977 నవంబరు 14న కన్నుమూశారు.

సోనమ్ వాంగ్‌చుక్ (పుట్టిన రోజు)



ప్రముఖ ఇంజనీర్ సోనమ్ వాంగ్‌చుక్ 1966 సెప్టెంబరు 1న జన్మించారు. ఆవిష్కర్తగా, విద్యావేత్తగా గుర్తింపు పొందారు. 'స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లద్దాఖ్‌'కు సంస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. సౌర శక్తితో వంట, విద్యుత్ ఇతరత్రా అవసరాలకు ఉపయోగించారు. కృత్రిమ గ్లేసియర్స్ ద్వారా పలు ప్రయోగాలు చేశారు. 2018 లో రామన్ మెగసెసె అవార్డు, గవర్నర్ మెడల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిఫార్మ్స్ ఇన్ జమ్ముకశ్మీర్ తదితర గౌరవాలు పొందారు.

యామినిరెడ్డి (పుట్టిన రోజు)



కూచిపూడి నృత్యంద్వారా పేరొందిన శాస్త్రీయ నృత్యకారిణి యామినిరెడ్డి 1982 సెప్టెంబరు 1న జన్మించారు. 'పద్మభూషణ్' పురస్కార గ్రహీతలైన డాక్టర్ రాజారెడ్డి, రాధారెడ్డిల కుమార్తె. తల్లి దండ్రుల వద్దనే నాట్యం చేరుకుని రాణించారు. హైదరాబాద్‌లో నాట్యతరంగిణి డ్యాన్స్‌స్కూల్‌లో నృత్య పాఠాలు బోధిస్తున్నారు. యువరత్న అవార్డు, సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్, దేవదాసి నేషనల్ అవార్డు, ఎఫ్ఐసీసీఐ యంగ్ అచీవర్స్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

మన్‌జిత్‌సింగ్ (పుట్టినరోజు)



ఇండియన్ అథ్లెట్‌లలో ఒకరైన మన్‌జిత్‌సింగ్ 1989 సెప్టెంబరు 1న హరియాణ రాష్ట్రం ఉజానాలో జన్మించారు. మిడిల్ డిస్టన్స్ రన్నర్ 800 మీటర్లు, 1500 మీటర్ల విభాగాలలో సత్తా చాటుకున్నారు. జకార్తాలో 2018 ఏసియన్ గేమ్స్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి 800 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించారు.

ఖాద్రీశా.. కరుణించు !



స్వామివారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

కదిరి, ఆగస్టు 31: శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు ఇబ్బందిలేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అలరించిన పరిపూర్ణ మహా అవతారి



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, ఆగస్టు 31: బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యంతో భక్తులను అలరింప జేశారు. శ్రీసత్యసాయి జిల్లా సేవా సంస్థలు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ నందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. బాలవికాస్ చిన్నారులు పరిపూర్ణ మహా అవతారి పేరిట సంగీత నృత్యంతో భక్తులను తన్మయపరిచారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. పర్తి యాత్ర పేరిట జిల్లా నలమూల నుంచి మూడు వేల మంది సేవా దళ్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

పుట్టపర్తి, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఆయన శనివారం తన చాంబర్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. అల్పపీడనం రాత్రికి తీరం దాటుతుందని, దీంతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా మండల నోడల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. నోడల్ అధికారులు మూడు రోజుల పాటు ఆయా మండల కేంద్రాల్లో పరిస్థితిని పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆలయాలలో శ్రావణ శనివారం వైభవం



రూపేన అగ్రహారలో లక్ష్మీ వెంకటరమణస్వామి హారతి



శ్రీకృష్ణుడి రూపంలో శ్రీనివాసుడు



ఆంజనేయస్వామికి విశేష అలంకరణ



శిడ్లఘట్టలో ఆంజనేయస్వామి



రూపేన అగ్రహారలో గరుడసేవలో స్వామివారు

బాగేపల్లి, ఆగస్టు 31: పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, శనైశ్వరుడు, ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో విశేషపూజలు కొనసాగాయి. తాలూకా శివారులోని దేవరగుడిపల్లిలోని భూనీల సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి శనివారం శ్రీకృష్ణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కె.ప్రకాశ్‌రావ్‌స్వామి మాట్లాడుతూ స్వామివారిని స్మరిస్తే కోరికలు ఈడేరుతాయనేది భక్తుల విశ్వాసంగా ఉందన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గడిదం కొండపైభాగాన నెలకొన్న రెండు కన్నుల అభయాంజనేయస్వామికి అభిషేకం, అష్టోత్తర శతనామావళి ఇతర కైంకర్యాలు నెరవేర్చారు.


శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట తాలూకాలోని పలు ఆలయాలలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బెశ్వాటి గేట్, జంగమకోటి రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి 101 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. తలకాయలబెట్టపై కొలువైన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, వీరాంజనేయస్వామి ఆలయం, శనిమహాత్ముడి ఆలయంలోనూ పూజలు సాగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గోవిందనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

బొమ్మనహళ్ళి: శ్రావణమాసం నాల్గో శనివారం పురస్కరించుకుని విష్ణు ఆలయాల్లో భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగాయి. రూపేన అగ్రహారలోని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు కొనసాగాయి. ప్రత్యేకించి తిరుప్పాడ సేవ నిర్వహించారు. గరుడవాహనంపై స్వామివారిని ఊరేగించారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం వేళ భజన బృందాలచే భజనలు కొనసాగాయి. శ్రావణమాసంలో ప్రతిరోజూ విశేష పూజలు కొనసాగాయని ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణభట్ తెలిపారు. చివరి శనివారం కావడంతో భక్తులు వేల సంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఆలయ దాతలు దివంగత గోపాలరెడ్డి కుటుంబీకులు కమలమ్మ, కుమారులు నరేంద్రబాబు తదితరులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

వాసవీమాతకు పుష్పయాగం



అమ్మవారికి బుట్టలతో పుష్పాలు

శిడ్లఘట్ట, ఆగస్టు 31: శిడ్లఘట్ట పట్టణంలోని ఇదే తొలిసారిగా వాసవి కల్యాణమండపంలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి శుక్రవారం సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. నాద, వేద, సంగీతాల వేదికల సమ్మిళితంతో నాగస్వర వాదనతో పుష్పయాగం ఆరంభించారు. సంగీత విదూషి మంజుళా జగదీశ్ బృందం ఆలపించిన భక్తిపాటలు భక్తులను అలరించాయి. మూడు గంటలపాటు పుష్పయాగం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముత్తైదువులు కళశాలు, పుష్ప గుచ్ఛాలతో పురవీధులలో శోభాయాత్రగా సాగారు. బాలాజి సేవా ట్రస్టు సీకల్ రామచంద్రగౌడ, ఆనందగౌడ, ముఖ్యులు మురళీధర్, సురేంద్రగౌడ, పిఎల్‌డి బ్యాంకు మాజీ అధ్యక్షుడు రామచంద్ర, ఆర్యవైశ్య మహిళా మండలి, వాసవి యువజనసంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటిస్తేనే హోటళ్ల అభివృద్ధి

» భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్



సన్మానంలో మంత్రులు ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు తదితరులు

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాణ్యత, రుచులు, మర్యాదతనంతోనే హోటళ్ల అభివృద్ధికి మార్గమని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయపడ్డారు. కర్ణాటక స్టేట్ హోటల్స్ అసోసియేషన్ అధ్వర్యంలో సమ్మిళన పేరిట శనివారం ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. రానున్న రెండేళ్లలో హోటల్‌రంగం చేపట్టాల్సిన అంశాలపై సమీక్ష జరిగింది. మంత్రులు దినేశ్ గుండూరావు, రామలింగారెడ్డితోపాటు కాపు ఎమ్మెల్యే సురేశ్‌శెట్టి పాల్గొన్నారు. ఎంఆర్‌జి గ్రూప్ చైర్మన్ డాక్టర్ కె ప్రకాశ్‌శెట్టితోపాటు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ హెబ్బార, రాజేంద్రలతోపాటు ఆంధ్రస్టైల్ పితామహగా పేరొందిన ఆర్ఆర్ రమణారెడ్డిలను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జికె శెట్టి, గౌరవ కార్యదర్శి రాఘవేంద్రరావ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. నందన గ్రూప్ హోటల్స్ యజమాని రవిచందర్‌తోపాటు అన్ని జిల్లాల హోటళ్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



మేళా ప్రారంభోత్సవంలో ప్రముఖులు

మహదేవపుర, ఆగస్టు 31: ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకుని ఉత్తమ జీవనానికి బాటలు వేసుకోవాలని సిలికాన్‌సిటీ కాలేజ్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎం చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. కేఆర్‌పురలోని సిలికాన్ సిటీ కళాశాలలో శనివారం ఏర్పాటైన ఉద్యోగమేళాను ప్రారంభించి మాట్లాడుతూ దేశవిదేశాల్లో పర్యటించిన వేళ అక్కడి విద్య, ఉద్యోగ విధానాలను ప్రత్యక్షంగా తిలకించానన్నారు. మనదేశంలో కూడా ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంగా తనవంతుగా ఏటా కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోటరీ సంస్థ సహా పలు కంపెనీలు సహకారం అందించాయన్నారు. రోటరీ బెంగళూరు మాన్యతా అధ్యక్షుడు రొటేరియన్ రవీంద్ర, మేళా నిర్వాహకులు తేజస్‌గౌడ, కళాశాల డైరెక్టర్ ముకుంద, జగదీశ్‌రెడ్డి, సీఈఓ ధన్యతేజస్, సీఓఓ భాను ప్రద్యుమ్న, ఆదిలక్ష్మి, ప్రొఫెసర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అవకాశాలు



ప్రతిభాకారంజిలో పాల్గొన్న విద్యార్థులు

శిడ్లఘట్ట, ఆగస్టు 31: కేవలం పాఠ్యపుస్తకాలు, మార్కులకే పరిమితం కాకుండా పాఠ్యేతర అంశాలలో పాల్గొనడం ద్వారా ప్రతిభావంతులకు అవకాశం లభిస్తాయని గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మేలూరు గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 2024-25 వార్షిక మేలూరు క్లస్టర్ స్థాయి విద్యార్థుల ప్రతిభా కారంజిలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు. 16 పాఠశాలలనుంచి 350కుపైగా విద్యార్థులు పాల్గొన్నారు. సహాయక డైరెక్టర్ ఆంజనేయ, సమన్వయాధికారి లక్ష్మీనారాయణ, మేలూరు గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఉమేశ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు కె.బి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పాఠశాలల మనుగడకు కృషి : టీవీఎస్



పాఠశాల కమిటీ పదాధికారులకు చెక్కు అందజేత

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగు పాఠశాలల మనుగడను కాపాడేందుకు నిరంతరంగా కృషి చేశామని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు తెలిపారు. ఓపీహెచ్ రోడ్డులోని తెలుగు, కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.4లక్షల దాకా ఖర్చు చేశామన్నారు. శివాజినగర్, బన్నేరుఘట్ట రోడ్డునుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సదుపాయం కోసం రూ.70వేల చెక్కును అందించారు. తెలుగు భాషాభిమానులు, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యలహంకలోని నీలకంఠేశ్వర పాఠశాల విద్యార్థులకు యూనిఫాం ఇవ్వదలిచామని ఇటీవలే తెలుగు విజ్ఞాన సమితి కార్యవర్గ సమావేశంలో తీర్మానించామన్నారు. ఈ మేరకు నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

95.51 టీఎంసీలకు చేరిన నిల్వలు



కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటం వల్ల డ్యాంకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. విద్యుదుత్పత్తి ద్వారా 5000 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. డ్యాం నీటి నిల్వలు శనివారం రాత్రికి 95.519 టీఎంసీలకు చేరాయి. ఇన్‌ఫ్లో 38,759 క్యూసెక్కులు కాగా, మొత్తం ఔట్ ఫ్లో 10,067 క్యూసెక్కులు. ఆగస్టు 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో, ఆ స్థానంలో కొత్తగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చిన విషయం విదితమే. క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన సమయంలో వరద నీటితో పాటు డ్యాంలో 30 టీఎంసీల నీరు నదికి మళ్లించారు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు రావేమోనని రైతులు ఆందోళన చెందారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.7 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 95 టీఎంసీలు దాటింది.

అధిక వసూళ్లపై ఆగ్రహం

టోల్‌ప్లాజా వద్ద లారీ యజమానుల ధర్నా
మంత్రి చొరవతో సమస్యకు పరిష్కారం



టోల్‌ప్లాజా వద్ద అడ్డుగా నిలిపిన లారీలు



యజమానులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

లేపాక్షి, ఆగస్టు 31 : టోల్ ప్లాజా వద్ద అధిక రుసుము వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద ఉన్న టోల్‌ప్లాజావద్ద వాహనాలను అడ్డంగా నిలిపి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో లోడ్‌తో వెళ్తున్న లారీకి రూ.100, ఖాళీలారీకి రూ.50 వసూలు చేసేవారని, వారం రోజులుగా ప్రతి వాహనంపై రూ. 25 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. రహదారికి అడ్డంగా వాహనాలను ఆపి ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో బీసీ వెల్ఫేర్, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అటుగా వచ్చారు. లారీలను అడ్డంగా ఉంచడంతో ఆమె ఆరా తీశారు. టీడీపీ మైనార్టీ నాయకులు షేక్షావలి, వాహన యజమానులు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి కలగజేసుకుని బోర్డు వేయకుండా అధికంగా రుసుము ఎలా వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వాహనదారులకు రుసుములో మినహాయింపు ఇవ్వాలని టోల్ సిబ్బందికి సూచించారు. మరో సారి అధిక వసూళ్ల చేయరాదని ఆదేశించారు. మంత్రి హామీతో లారీ యజమానులు ధర్నా విరమించారు.

అనుమానంతో భార్యను షెడ్‌లో బంధించిన కానిస్టేబుల్

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయం, మహిళలకు రక్షణ కల్పించడమే విధిగా కొనసాగించాల్సిన ఓ పోలీస్ కానిస్టేబుల్ భార్యపై అనుమానంతో విచక్షణా రహితంగా దాడి చేసి ఓ షెడ్‌లో బంధించిన సంఘటన బెళగావి జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని తికోటలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. రాయబాగ తాలూకా నిడగుంది గ్రామానికి చెందిన ప్రతిమాకు అథణి తాలూకా కున్నాళ గ్రామానికి చెందిన ఎల్లప్ప ఆగనతో పదేళ్ల క్రితం పెళ్లయ్యింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇటీవల ఎల్లప్ప భార్యపై అనుమానంతో షెడ్‌లో బంధించారు. ముఖం చేతులు, కాళ్ల కాలిపోయేలా వాతలు పెట్టాడు. ఈ సందర్భంగా శనివారం ప్రతిమా మాట్లాడుతూ రెండు నెలలుగా షెడ్‌లో బంధించారన్నారు. భర్తతోపాటు అక్క చెల్లెళ్లు దాడి చేశారన్నారు. ఇటీవలే మా కుటుంబ సభ్యులు చూసేందుకు వస్తే ప్రతిమా మరొకరితో లేచిపోయారని, మీపై కేసు పెడతానని బెదిరించారన్నారు. షెడ్‌లో ఎవరూ లేని సమయంలో తప్పించుకుని బెళగావి మహిళా సంఘం ద్వారా జిల్లాసుపత్రిలో చికిత్సలు పొందుతున్నా అన్నారు. జిల్లా ఎస్పీని కలసి నా బాధను చెప్పుకుంటానన్నారు.

యథేచ్ఛగా ...

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వైసీపీ నాయకుడు
నేలకోట తండా చెరువులో దోపిడీ



ట్రాక్టర్‌లోకి ఇసుకను నింపుతున్న ఎక్స్‌కవేటర్

ధర్మవరం రూరల్, ఆగస్టు 31: మండలంలోని నేలకోటతండా చెరువులో ఓ వైసీపీ నాయకుడు యథేచ్ఛగా ఇసుకను తవ్వేస్తున్నాడు. ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వుతూ ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇంత దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మరింత రెచ్చిపోయిన అక్రమార్కుడు గత రెండు రోజులుగా చెరువులో మరింతగా తవ్వకాలు సాగిస్తున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు. సుమారు 50 ట్రాక్టర్ల ద్వారా శనివారం ఇసుకను డంప్ చేయించాడు. దాన్ని రాత్రివేళ ధర్మవరం, ముదిగుబ్బ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.3వేల నుంచి 4వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. రూరల్ పోలీసులకు ఈ విషయం తెలిపితే వారు మామూళ్లు పుచ్చుకుని మిన్నకుండిపోతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తరలించే వీడియోను గ్రామస్థులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయినా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి చెరువును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.13	1,625.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	34,983	261
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,067	9,075
సామర్థ్యం (టీఎంసీలు)	94.55	77.01

హంపీలో ఆర్థిక సంఘం సభ్యుల పర్యటన



ఏనుగుల శాల తిలకిస్తున్న కేంద్ర బృందం

బళ్లారి, అగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అయిన హంపీలో కేంద్ర 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియా, సభ్యులు, డైరెక్టర్లు, తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శనివారం పర్యటించింది. హంపీలో విరుపాక్షేశ్వరస్వామిని దర్శించుకుని అక్కడ నుండి ఎదురబసవన్న మంటపం, చక్రతీర్థ, రామలక్ష్మనగుడి, మహానవమి దిబ్బ, సప్తస్వరాలు, రాతి రథం తదితర ప్రాంతాలను సందర్శించారు. హంపీలోని గైడ్లు వీరికి ఇక్కడి చరిత్ర, విశేషాలు, సౌకర్యాలు, ప్రాముఖ్యత గురించి వివరించారు.

పీడీహళ్లి అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి



పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీదేవిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, అగస్టు 31 : బళ్లారి తాలుకా పరమ దేవనహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి శివరాజ్‌ను తొమ్మిది మంది గ్రామ పంచాయతీ సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఈవో బసప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పీడీవో గోవిందప్ప, రిటైర్డ్ పీడీవో తిప్పేరుద్ర, గ్రామ ప్రముఖులు భైరప్ప, గోపాలప్ప, జనార్థన్ నాయక్, శివరాజ్ నారాయణప్ప, జానకి సుంకన్న, సుధాకర్, రిటైర్డ్ ఏఎస్ఐ వన్నూరప్ప, పంపారెడ్డి, పోస్ట్ నాగరాజు, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాన్ని ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీ చెన్నప్ప

కంప్లి, అగస్టు 31 : కంప్లి పట్టణంలో నూతనంగా తాలుకా క్రీడాంగణం, కోర్టు, అగ్నిమాపకదళం, బస్సు డిపోలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు రైతు సంఘం హసురుసేన తాలుకా అధ్యక్షులు చెన్నప్ప తెలిపారు. శనివారం తహసీల్దార్‌కు విద్యార్థులు మనవిపత్రం సమర్పించారు. తాలుకా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు సరియైన సదుపాయాలు లేవన్నారు. కేవలం పేరుకుమాత్రమే తాలుకా ఏర్పడిందన్నారు. సంతోష్‌కుమార్, సోమన్నగౌడ, లింగరాజు, సోమప్ప, హనుమంతు, మహేంద్ర తేజ, గణేష్, మోహన్, బసవరాజు, మాంతేష్ , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార సరఫరాకు ప్రాధాన్యం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, అగస్టు 31: సండూరు తాలూకాలోని వివిధ రెస్టారెంట్లను, హోటళ్లను తనిఖీ చేసి వారికి నాణ్యమైన ఆహార సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని ఫుడ్‌సేఫ్టీ అధికారి అంబదాస్ సూచించారు. తోరణగల్లులో వివిధ హోటళ్ళు, రెస్టారెంటు తదితర వాటిని అధికారులు తనిఖీ చేశారు. తదనంతరం 10 రకాల ఆహార పదార్థాలను సేకరించి లేబోరేటరీకి పంపారు. ఫుడ్ సేఫ్టీ అధికారి సందకాడివ్యాపారులకు అవగాహన పత్రాలు అందించి నిబంధనల మేరకు జరిమానా విధించారు.

వందే లంకా భయంకరం!

శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా ఆంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సిరుగుప్ప ఆంజనేయస్వామి



సిరుగుప్ప పట్టణంలో వర ఆంజనేయస్వామి, పేటే ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వాముల వారికి పుష్పాలంకార సేవ, ఆకుపూజ కార్యక్రమాలను చేపట్టారు.

ఆలయంలో అన్నదానం



శ్రావణమాసం నాల్గవ శనివారం సందర్భంగా సిరుగుప్ప వర ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో అన్నదానానికి భక్తులు క్యూకట్టారు. ఆలయాల్లో భక్తులు స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటేశ్వరనగర్‌లో



బళ్లారి నగరం వెంకటేశ్వరనగర్‌లో వెలసిన అభయాంజనేయ స్వామికి శ్రావణమాసం నాల్గవ శనివారం సందర్భంగా ప్రత్యేకంగా తులసీ అలంకరణ చేశారు. స్వామివారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు.

మోకా మరూరులో ఉచిత వివాహాలు



బళ్లారి తాలూకా మోకా మరూరు ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో నాల్గవ సంవత్సరం ఉచిత వివాహాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు.

మన సంస్కృతితోనే మంచి సమాజం

● సేడం కొట్టాల బసవేశ్వర దేవాలయం సదాశివ స్వామీజీ



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సదాశివస్వామి

బళ్లారి సిటీ, అగస్టు 31: నేటి బాలలు మన భారతీయ మూల సంస్కృతిని అలవర్చుకుంటే మంచి సమాజ నిర్మాణం ఖాయమని సేడం కొట్టాల బసవేశ్వర దేవాలయ సదాశివ స్వామీజీ అన్నారు. శనివారం నగరంలోని రాఘవకళామందిరంలో కల్యాణ కర్ణాటక వికాస అకాడమీ, సేడం కొట్టాల బసవేశ్వర భారతీయ విద్యాకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ కర్ణాటక వికాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన సంస్కృతి ఇతర దేశాల వారికి ఆదర్శమని, దాని వల్ల అనేక దేశాల పౌరులు మన సంస్కృతి పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు.అహింసాయుత జీవితం ద్వారా ఇతరులకు నొప్పి కలగకుండా వారి మన్ననలను పొందడమే మన ధ్యేయంగా ఉండాలని అన్నారు. వారి మన్ననలు పొందడమే మనధ్యేయంగా ఉండాలని అన్నారు. 2025లో జనవరి 29నుండి ఫిబ్రవరి 6వరకు కలబుర్గి జిల్లాలోని సేడమ్‌లో వ్యక్తి అభ్యున్నతే లక్ష్యంగా తొమ్మిది రోజుల ఉత్సవాలలో పాటు ఈ కల్యాణ కర్ణాటక వికాస నవ సంచారానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, 4రాష్ట్రాల గవర్నర్లు, ఇన్ఫోసిస్ సుధామూర్తి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ సహా 153 మంది ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమానికి 30లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈసందర్భంలో కల్యాణ స్వామి, రుద్రప్ప, కమ్మరచేడు కల్యాణ కర్ణాటక వికాస్ అకాడమీ జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, అడవిస్వామి, కల్యాణ స్వామి, అధ్యక్షుడు అల్లం గురుబసవరాజ్, వెంకటేశ బడిగెర తదితరులున్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

బళ్లారి సిటీ, అగస్టు 31: ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐయూటీయూసీ ప్రముఖులు దేవదాస్ అన్నారు. నగరంలోని గాంధీభవనంలో శనివారం కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశావర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. సభకు ముందు వందలాది మంది ఆశా వర్కర్లు ప్రధాన వీధులగుండా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ ప్రముఖులు దేవదాస్ మాట్లాడుతూ ఆశా వర్కర్లను స్కీమ్ వర్కర్‌లుగా తీసుకున్నారని, కేవలం రెండు గంటల పని మాత్రమే నని ఇప్పుడు రోజుకు 12గంటలకు పైగా పనిచేయిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వాలు ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం లేదన్నారు. శాశ్వతత్వం పేరుతో కార్మికులను ఏనాడు పరిగణలోకి తీసుకోకుండా వారు పొందవలసిన చట్టబద్ధమైన ప్రయోజనాలు వారికి రాకుండా మోసం చేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు శ్రామిక ప్రజలకు అనుకూలంగా లేవని అన్నారు. బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆశలతో సహా మొత్తం కార్మికవర్గం ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐయూటీయూసీ దేవదాసు తదితరులు

ఆశావర్కర్స్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ, గ్రామాలు, నగరాల్లో మాతా , శిశు మరణాలను తగ్గించడంలో ఆశాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. నేడు చలికి, వానకు, గాలికి తినకుండా నిద్రపోకుండా పగలు, రాత్రి అనే తేడా లేకుండా పని చేసే ఈ మహిళలను ప్రభుత్వం దోపిడీ చేస్తోందన్నారు. 15ఏళ్లుగా నిరంతర పోరాటం ఫలితంగా ఇప్పుడు వారికి స్థిరమైన జీతాలు వచ్చాయని, అది కూడా నెలకు రూ. 7వేలు నుండి 8వేలు మాత్రమేనన్నారు. నిర్ణీత వేతనం రూ. 15వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో కర్ణాటక రాష్ట్రసంయుక్త ఆశా వర్కర్స్ అసోసియేషన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఈ పోరాటంలో భాగంగానే సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ఈసందర్భంగా వేదికపై సంఘం కార్యదర్శి గీత, జిల్లా గౌరవాధ్యక్షులు శాంత, వీరమ్మ, హనుమంతమ్మ, యశోద, సుజాత తదితరులున్నారు.

ఇబ్బందుల్లో ప్రయాణికులు - నిద్రమత్తులో అధికారులు

సిరుగుప్ప, అగస్టు 31 : సిరుగుప్ప తాలుకాలో టెక్కలకోట మారెమ్మదేవి ఆలయం నుంచి దడేసూగూరు బ్రిడ్జి వరకు 11 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణాన్ని రూ. 118 కోట్లతో 2022లో పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం ఒక కిలోమీటర్ పనులు కూడా పూర్తి చేయలేదు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై జిల్లా అధికారులు, ఎంహెచ్ అధికారులు నోటీసులు జారీ చేసినా పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. ప్రస్తుతం రోడ్డు గుంతలు పడి మట్టి రోడ్డుగా మారింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 యేళ్లు దగ్గర పడుతున్నా కనీసం రోడ్లు కూడా బాగు చేయకపోతే ఎన్‌హెచ్ అధికారులు ఏమి విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘ నంస్థలు ఈ విషయంపై పోరాటాలు ఎందుకు చేయడం లేదని విమర్శిస్తున్నారు. సార్వజనికులు ఈ 11 కిలోమీటర్ల ప్రయాణం చేయాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు సంబంధించి ఎన్‌హెచ్ అధికారి జాకీర్ హుస్సేన్‌ను వివరణ కోరగా డిసెంబరు వరకు ఇంతకు ముందు వున్న కాంట్రాక్టర్ కాల వ్యవధి ముగుస్తుందని, మిగిలిన పనులకు కొత్త టెండర్లను పిలుస్తామని ఆయన తెలిపారు.



అధ్వాన్నస్థితిలో ఎన్‌హెచ్ రహదారి

ఆంజనేయస్వామి సేవలో మాజీ సీఎం సదానందగౌడ



కార్యక్రమానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ

బళ్లారిరూరల్, అగస్టు 31 : బళ్లారి తాలుకాలోని మోకా మరూరు ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి పాల్గొని హనుమాన్ మాలాధారణ చేసిన భక్తుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన ఉచిత వివాహాల్లో ఒక్కటైన జంటలను ఆశీర్వదించారు. మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ ఉచిత వివాహాల వల్ల పేదబడుగు బలహీన వర్గాలకు ఎన్నో సౌకర్యాలు కలుగుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేసేవారికి ఎంతో పుణ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు మోకా, అనిల్ నాయుడు, తదితరులు పాల్గొని ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు.

శ్రీ ఆంజనేయస్వామి నూతన దేవస్థాన ప్రారంభం



ఆంజనేయస్వామిని దర్శించుకున్న తర్వాత మాట్లాడుతున్న ఎంపీ

తోరణగల్లు, అగస్టు 31 :సండూరు తాలుకా జిగినహళ్లి గ్రామంలో శనివారం శ్రీ ఆంజనేయస్వామి నూతన దేవస్థానం ప్రారంభం, గరుడకంబ స్థాపన, కలశారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు తుకారామ్ పాల్గొని మాట్లాడుతూ భక్తిఅనేది మనిషి జీవితానికి సంబంధించినదని, మన నడవడిక బాగుండాలని సౌహార్ద జీవితం సాగించాలని అందరికీ ఆంజనేయస్వామి ఆశీర్వాదం లభించాలని కోరారు. ఈ సందర్భంగా సండూరు విరక్తి మఠ ప్రభుస్వామి అలాగే యశ్వంత్‌నగర్ స్వామి గంగాధర స్వామి పుర ప్రముఖులు, చుట్టుపక్కల నుండి భక్తాదులు పాల్గొన్నారు.

185వ ఛాయాగ్రహణ దినోత్సవం

సండూరు పట్టణంలోని ఆదర్శ కళ్యాణమండపంలో శనివారం ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో 185వ విశ్వఛాయాగ్రహణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు తుకారామ్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల, వీడియో గ్రాఫర్ల ప్రాముఖ్యతను వివరించారు. వారికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ వుంటాయన్నారు. ఈ సందర్భంగా షైన్స్ ఓనర్ టీకే నాగన్నగౌడ్, ఎస్ఎం వినయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు నాగేష్, క్షేత్ర శిక్షణాధికారి ఐఆర్ అక్కి, అలాగే గౌరవాధ్యక్షులు జిలాన్ పాల్గొన్నారు.

బ్యాంకు సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి



జనసమృద్ధి సొసైటీని ప్రారంభిస్తున్న ఉపాధ్యక్షులు రాజేష్

కంప్లి, అగస్టు 31 :జనసమృద్ధి మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని రాజేష్ తెలిపారు. కంప్లి పట్టణంలో బళ్లారి రోడ్డులోని నూతన శాఖను ఆయన ప్రారంభించారు. ఇది 32వ శాఖ అన్నారు. ఈ కార్యక్రమంలో గిరీష్, కుమారస్వామి, ఆనంద్, నవీన్, రాజేష్, లక్ష్మీ, రాజు, సుధ, తదితరులు జనసమృద్ధి సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

జాబ్‌మేళాలో 762మంది ఎంపిక



జాబ్‌మేళాలో అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) అగస్టు 31: హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో 762 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ జాబ్‌మేళాలో సీల్‌మెటల్ ప్రొడక్ట్, టీవీఎస్ సప్లై పోలీస్ లిమిటెడ్, ఎంఆర్ఎఫ్ కంపెనీ, ఏటీటెక్ ప్రైవేట్ లిమిటెడ్, సుందరం ఆటో లిమిటెడ్, ట్యాఫ్ ఇండియా టీవీఎస్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర 150 కి పైగా ప్రైవేట్ కంపెనీలు హాజరై అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకున్నాయి. వారిల్లో 4,624 మంది ఉద్యోగార్థులు శనివారం పని కోసం నమోదు చేసుకోగా, ప్రైవేట్ సంస్థలవారు 762 మందిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ , కార్పొరేషన్ కమిషనర్ హెచ్ఎస్ శ్రీకాంత్ ఈపీఏ,రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ పెరియస్వామి, హోసూరు కలెక్టర్ ప్రియంక, ఈపీఏ, జిల్లా ఉపాధి అధికారి గౌరీశంకర్ జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ ప్రసన్న బాలమురుగన్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శరవణన్ , కార్మిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాదేశ్వరన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో చివరి శ్రావణ శనివారం పూజలు

హోసూరు అగస్టు 31 : హోసూరు ప్రాంతంలో చివరి శ్రావణమాసం శనివారం సందర్భంగా తెలుగు, కన్నడ ప్రజలు పూజలను ఘనంగా జరుపుకున్నారు. హోసూరు పరిసర ప్రాంతంలోని వెంకటాచలపతి ఆలయంలో శ్రీ కృష్ణ ఆలయంలో రామ ఆలయంలో వేకువ జామునుంచి ప్రజలు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు. అలాగే ఈ ఏడాది కూడా ఘనంగా శ్రావణమాస ఉత్సవాలను జరుపుకుని తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అథ్లెటిక్ పోటీల్లో జాన్‌బాస్కో విద్యార్థినుల సత్తా

హోసూరు అగస్టు 31 : హోసూరు అదియమాన్ కళాశాలలో గత రెండు రోజులుగా దక్షిణాది స్థాయిల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న జాన్ బాస్కో పాఠశాల విద్యార్థులు 160 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్ ను కైవసం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో వ్యక్తిగతంగా నర్మద 15 పాయింట్లు సాధించారు. మానస 13 పాయింట్లు సాధించి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నారు. హైజంప్ రన్నింగ్ ఈ వెంట్లలో బంగారు రజత పతకాలను కూడా గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఏంజెలా, ప్రధాన ఉపాధ్యాయురాలు జయంతి, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.



ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్న విద్యార్థులు

12 గంటలలో మిస్సింగ్ కేసు ఛేదింపు

తల్లిదండ్రుల చెంతకు చేరిన కిడ్నాప్‌నకు గురైన బాలుడు గానయోగి..



తప్పిపోయిన బాలుడు గానయోగిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అనంతపురం మ్యాటౌన్, అగస్టు31: అనంతపురం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అదృశ్యం అయిన రాయచూరు బాలుడి ఆచూకీని రైల్వే పోలీసులు 12 గంటలలోపే ఛేదించారు. బాలుడు గానయోగిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రైల్వే పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు ప్రకాష్ , శారదాబాయిలు తమ కుమారుడైన గానయోగి, 3 సంవత్సరాలు, అను అనే ఏడు నెలల కూతురుతో కలిసి శుక్రవారం రాయచూరు నుండి బెంగుళూరుకు కూలీ పనుల నిమిత్తం రైలు నెంబర్ 11301 ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో రాయచూరు నుండి బయలుదేరారు. జనరల్ బోగీలో ప్రయాణిస్తూ ప్రకాష్ తన కొడుకు గానయోగిని పక్కన కూర్చోబెట్టుకొని కునుకు తీశాడు. అదే రైల్లోనే పక్కనే కూర్చోని ప్రయాణిస్తున్న గుల్బర్గకు చెందిన జంట రూపేష్, కుసుమలు దీన్ని గమనించి గానయోగిని అపహరించి అనంతపురం రైల్వే స్టేషన్‌లో దిగి తిరిగి బస్సులో గుల్బర్గకు చేరుకున్నారు. దీంతో ప్రకాష్, శారదా బాయి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసునమోదు చేసుకొని రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నాగరాజు పర్యవేక్షణలో బాలుడి కోసం గాలింపు ప్రారంభించారు.

వారికి దొరికిన ఆధారాల మేరకు జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తన టీమ్‌తో గాలిస్తుండగా రాయచూర్ ఆర్‌పీఎఫ్ సీఐ సహకారంతో గుల్బర్గకు వెలుతున్న జంటతో పాటు బాలుడిని గుర్తించారు. రాయచూర్ స్టేషన్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న అనంతరం సిబ్బంది గుల్బర్గ జంటతో పాటు బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు. గుల్బర్గకు చెందిన జంటపై కిడ్నాప్ కేసు నమోదు చేసి కస్టడీకి తరలించారు. ఈ గాలింపులో ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాష్, ఏఎస్ఐ రఫీ, జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్స్ శ్రీరాములు, దామోదర్ కానిస్టేబుల్స్ భాస్కర్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.